క్లుప్తంగా

జీ-20 సదస్సుపై చైతన్యం



20 దేశాల జెండాలతో విద్యార్థులు

లావేరు: ఈ నెల 6 నుంచి 10వ తేదీల్లో ఢిల్లీలో జరుగనున్న జీ20 సదస్సు సందర్భంగా విద్యార్థుల్లో చైతన్యం కల్పించడం కోసం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ, ఏపీ ఎన్జీసీ ఆదేశాల మేరకు మండలంలోని బుడుమూరు హైస్కూల్‌లో శుక్రవారం యువమంతన్-20 కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులతో 20 దేశాలకు చెందిన జెండాలతో పాల్గొని ఆయా దేశాల గురించి జీ-20 సదస్సు మాదిరిగా నిర్వహించారు. ఈ 20 దేశాల్లో అమలు జరుగుతున్న కార్యక్రమాలను చర్చించారు. హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీ-20 సదస్సు గురించి విద్యార్థులకు తెలియడం కోసం ఈ కార్యక్రమం ఎంతగానో విద్యార్థులకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీసీ జిల్లా సమన్వయకర్త పూజారి గోవిందరావు, ఉపాధ్యాయులు ఎస్‌కే ప్రసాదరావు, ఎం.అనురాధ, కె.వెంకటరావు, పి.తమ్మినాయుడు, ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మోష

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం అవసరమని సైక్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష అన్నారు. సంతసీతారాంపురం గ్రామంలోని సైక్ వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలపై బెంగుళూరుకు చెందిన ఎస్.ఎస్.ఐ.ఎ.ఎస్.టి ట్రస్టు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలు ఆధ్వర్యంలో మూడు రోజుల సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు మారాలన్నారు. యాజమాన్యం ఖర్చులు తగ్గటం, పంటల దిగుబడి పెరగటం కీలకమన్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల ప్రాధాన్యత తగ్గాలన్నారు. సీనియర్ బోధకులు రేణుక, రవికుమార్, కళాశాల యాజమాన్య సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



వాటర్ బాటిళ్లు అందజేస్తున్న అనిల్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని, బ్యాంకు సేవలపై పూర్తిస్థాయి విషయ పరిజ్ఞానం అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం అనిల్ కుమార్ అన్నారు. ఫరీదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఫ్లేర్ అఫ్ ప్రోగ్రాం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతికి ఆర్థిక అక్షరాస్యత ఉపయోగపడుతుందన్నారు. ఉన్నత విద్యకోసం బ్యాంకు లోన్లు ఇస్తాయని, జీవితంలో స్థిరపడిన తర్వాత లోన్లు చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. జాతీయ విద్యా సంస్థల్లో, విదేశాల్లో విద్య కొనసాగించే ప్రతిభ గల విద్యార్థులకు బ్యాంకులు అండగా ఉంటాయన్నారు. బ్యాంకు సేవలు విద్యార్థులు ఉపయోగించుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. ఎల్‌డీఎం సూర్య కిరణ్, బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రణస్థలం: జే.ఆర్.పురం పంచాయతీలో కూరగాయల మార్కెట్‌కు స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు సి.హెచ్ అమ్మన్నాయుడు, వెలమల రమణ కోరారు. జే.ఆర్.పురం పంచాయతీలో గల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి ఎల్.ఆదినారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ పంచాయతీలో సమగ్ర కాలువ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ఇంటింటికీ కుళాయిలు వేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. అధిక ధరలు, విద్యుత్ చార్జీల పెంపుపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏపీహెచ్‌బీ కాలనీలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



సంతాన లక్ష్మీగా దర్శనమిచ్చిన విజయదుర్గ



లావేరు: లావేరు కనకదుర్గ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సంతోషిమాత ఆలయం వద్ద క్యూలో భక్తులు

ఘనంగా వరలక్ష్మీదేవికి పూజలు



ఏపీహెచ్‌బీకాలనీలోని అష్టలక్ష్మీ సమేత లలితాదేవి



కోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసంలోని మూడో శుక్రవారం సందర్భంగా శ్రావణలక్ష్మీదేవికి భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ ఇళ్లల్లో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఆలయాలకు వెళ్లి సామూహిక కుంకుమార్చనలు, అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సంతానలక్ష్మీగా విజయదుర్గ

శ్రీకాకుళం నగరంలోని నానుబాలు వీధిలో వేంచేసిన విజయదుర్గా అమ్మవారిని సంతాన లక్ష్మీగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణిశర్మలు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సంతోషిమాత ఆలయంలో..

పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామాలతో కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

- ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న షిర్డీసాయి ధ్యాన మందిరంలోని అష్టలక్ష్మి పరివృత లలితాదేవి అమ్మవారికి సుహాసినలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
- పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో అమ్మవారికి క్షీరాభిషేకాలు, పంచామృతా భిషేకాలు జరిగాయి. అర్చకులు శేషాచార్యుల నేతృత్వంలో అమ్మవారికి అష్టఫలాలతో, తేనే, పెరుగు, పాలతో అభిషేకాలను చేశారు.
- నారాయణ తిరుమల కొండపై వెలసినవేంటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారికి అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో, చిందత్తనాథ క్షేత్రంలోని గాయత్రీ మాతకు, చిన్నబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి, చిన్నబజారు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. బలగ అయ్యప్పస్వామి ఆలయంలోని మహాలక్ష్మీకి కుంకుమ పూజల జరగ్గా అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు

లావేరు: శ్రావణ మాస మూడో శుక్రవారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో గల కనకదుర్గాదేవి, సంతోషిమాత, రాజరాజేశ్వరీదేవి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో కుంకుమ పూజలు చేపట్టారు.



కోటేశ్వరాలయంలో సామూహిక సుహాసిని కుంకుమ పూజలు

పాలసీదారులకు మెరుగైన సేవలందించాలి

- ఘనంగా ఎల్‌ఐసీ 67వ వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎం.వి.తిలక్

శ్రీకాకుళం అర్బన్: పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఎల్‌ఐసీ ఉద్యోగులు, ఏజెంట్‌లు, ఫీల్డ్ ఫోర్స్ మమేకం కావాలని రీజనల్ హెడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ పిలుపునిచ్చారు. భారతీయ జీవితబీమా సంస్థ 67వ వార్షికోత్సవాన్ని శ్రీకాకుళంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం నుంచి ఈ నెల ఏడో తేదీ వరకూ జరగనున్న వారోత్సవాలను తిలక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఐసీ అంటే 130 కోట్ల మంది ప్రజల్లో గట్టి నమ్మకం ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉందన్నారు. ఎల్‌ఐసీపై ప్రజలకు ఎనలేని నమ్మకం ఉందని..దాన్ని ఉద్యోగులు, ఏజెంట్లు నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎల్‌ఐసీ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ సాహు మాట్లాడుతూ.. గడచిన వార్షిక సంవత్సరములో 2.25 లక్షల క్లైములను పరిష్కరించి.. రెండు లక్షల తొమ్మిది వేల కోట్ల రూపాయలను క్లైముల రూపంలో పాలసీదారులకు చెల్లించడం జరిగిందన్నారు. వారోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు హైస్కూల్ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అలాగే నాలుగో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, ఐదో తేదీన ఎల్‌ఐసీపై అవగాహన ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ప్రతినిధులు అచ్యుతవల్లి లక్ష్మి, మధుసూదన్‌రావు, తారక్, గిరిధర్, రామకృష్ణ, వలసయ్య. దామోదర్‌రావు, అప్పన్న దొర ధనుంజయరావు, రమణమూర్తి, ప్రతాప్, సూర్యప్రకాశరావు ఉన్నారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యకేశవరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శిక్షణతో మెరుగైన సేవలు అందించే అవకాశం లభిస్తుందని విశ్రాంత ఎస్టీఓ ఎస్.సత్యకేశవరావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణలో భాగంగా శుక్రవారం నాలుగో రోజు కొనసాగింది. శిక్షణలో రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సేవలు అందిస్తున్న గ్రామ కార్యదర్శులకు పూర్తిస్థాయిలో పంచాయతీరాజ్ చట్టాలు, విధి, విధానాలపై అవగాహన ఉండాలన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ కొత్త విషయాలు తెల్సుకోవాలంటే శిక్షణలతోనే సాధ్యమన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు వారు చేస్తున్న ఉద్యోగానికి సంబంధించి పూర్తి విషయాలు తెలుసుకోవాలన్నారు. ఉద్యోగికి క్రమశిక్షణ, సమర్థ్యం అనే రెండు అంశాలు కీలకమైనవని వివరించారు. 73, 74వ రాజ్యాంగ సవరణలు తరువాత పంచాయతీరాజ్ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. గ్రామాల ప్రగతి కోసం కృషిచేయలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తరువాత పాలన విస్తరించిందన్నారు. కార్యదర్శులకు యోగా, మెడిటేషన్ క్లాసులు నిర్వహించారు. శిక్షణను జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్ పర్యవేక్షిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- కిమ్స్ రోడ్డులో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఓబులేసు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని కిమ్స్‌రోడ్డులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు కమిషనర్ దృష్టికి వచ్చింది. దీంతో శుక్రవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు పలు భవనాలను పరిశీలించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్టు నిర్ధారణకు వచ్చిన తరువాత వాటి మెషిన్లతో కూల్చివేశారు. ఈ సందర్భంగా పలువురు భవన యజమానులకు హెచ్చరించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఊపేక్షించేది లేదన్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపు మరో రెండు మూడు రోజులు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నిర్మాణాలు చేపట్టదలిచేవారు ప్లాన్‌లు తీసుకుని ధైర్యంగా నిర్మాణాలు చేపడితే ఎవ్వరికి భయపడాల్సిన అవసరం లేదని కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. కిమ్స్‌రోడ్డులోని భవనాలకు వద్దకు నేరుగా కమిషనర్ వెళ్లి తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. కమిషనర్‌తోపాటు టీపీవో ఉమామహేశ్వరరావు, టీపీఎస్ అప్పలరాజు ఉన్నారు.

నూతన పింఛన్లపై ఎంపీడీవో పరిశీలన

గార: మండలానికి కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవో ఎస్.రమణయ్య శుక్రవారం పరిశీలన చేశారు. మండలానికి ఈ నెలకు సంబంధించి 459 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయి. తూలుగు, రామచంద్రాపురం గ్రామాల్లోని సచివాలయాలకు ఎంపీడీవో వెళ్లి పింఛన్లపై ఆరా తీశారు.

పరిశీలన అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు నగదు మంజూరవుతోందని ఎంపీడీవో అన్నారు.

ఉపాధ్యాయుడు మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కానుక త్రినాథరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విద్య, సామాజిక రంగాలకు తీరనిలోటని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసి.. త్రినాథరావు మృతికి సంతాపం తెలియజేశారు. సంతాపం తెలియజేసిన వారిలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు చౌదరి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు దూసి ఆంధ్రా స్టాలిన్, ప్రధాన కార్యదర్శి కొమ్మన పురుషోత్తం, కార్యదర్శి పారశెల్లి రామరాజు, కోశాధికారి కొప్పల సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కుదమ తిరుమలరావు ఉన్నారు.

లక్ష్మీపురంలో భూ సర్వే ప్రారంభం

లావేరు: సమగ్ర భూ సర్వేతో రైతులుకు ఎంతో మేలు జరుగుతుందని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ అన్నారు. భూ సర్వే శుక్రవారం ప్రారంభించారు. రైతులుకు భూ సమస్యలు ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి ఈశ్వరరావురెడ్డి, కాగితాల కృష్ణారెడ్డి, కొల్లి రమణారెడ్డి, వీఆర్ఓ రామయ్య, సర్వేయర్లు, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రకు కలెక్టర్ అభినందన



మన్మథను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆగస్టు నెలలో ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్ర సనపల మన్మథకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అభినందించారు. ఆరోగ్యమిత్రగా మంచి సేవలు అందించారని, ముందు కూడా ప్రజా సేవను కొనసాగించాలని ఈ సందర్భంగా కలెక్టర్ మన్మథకు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రమణ

గార: శాలిహుండం అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి, భూగర్భ జలవనరులశాఖ ఉన్నతాధికారి రమణ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రికార్డులను, బాలల హాజరును తనిఖీ చేశారు. ప్రతినెల ఒకటో తేదీన వైఎస్సార్ పోషణ అందే లబ్ధిదారులపై ఆరా తీసి, పోషణ కిట్లు పంపిణీ జరుగుతున్న తీరును గమనించారు. కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి, లబ్ధిదారులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

జి.సిగడాం: పేదలకు పెన్నిధి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని శనివారం ముషినివలస పంచాయతీ సర్వేశ్వరపురం ప్రధాన రహదారిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహిస్తున్నామని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ వెల్లడించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లడారు. రాజన్న వర్ధంతిని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామస్థాయిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు, అనంతరం డీఆర్‌వలస, ముషినివలస, జాడ, జగన్నాథవలస గ్రామ సచివాలయాల కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి తిరువారాధన



ప్రత్యేక అలంకరణలో గురురాఘవేంద్ర సమాధి

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా నాగావళి తీరాన ఉన్న గురురాఘవేంద్ర స్వామి 356వ తిరు ఆరాధనోత్సవాలు శుక్రవారం జరిగాయి. మందిరం అర్చకులు మద్గల బాబు నేతృత్వంలో స్వామికి మద్యాహ్న ఆరాధనలో భాగంగా ఉదయం నిర్మాల్యసేవ, పంచామృతాభిషేకాలు అనంతరం ప్రత్యేకంగా అలంరించి అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అలంకార పంక్తి అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో మందిరం సభ్యులు ఎం.వి.వి. గోపాలరావు, ఎ.వెంకటరావు, కె.సురేష్, ఆరణి రామారావు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



తోటపాలెంలో కొత్తపింఛన్ అందజేస్తున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కళ్లేపల్లి తిరుపతిరావు



శ్రీకాకుళం రిమ్స్‌లో తులసమ్మకు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ మధు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లను బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కళ్లేపల్లి తిరుపతిరావు అందజేశారు. అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందన్నారు.

ఆస్పత్రికి వెళ్లి...

కుశాలపురం గ్రామానికి చెందిన కొమ్ము తులసమ్మ అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. గ్రామ వలంటీర్ బోడిగి మధు శుక్రవారం ఆస్పత్రికి ఆమెకు వెళ్లి వితంతు పింఛన్ అందజేశారు.

రణస్థలంలో..



రణస్థలం: పింఛన్లు పంపిణీ చేస్తున్న సాయికుమార్

రణస్థలం: మండల కేంద్రంలోని జే.ఆర్.పురం, రణస్థలం పంచాయతీల్లో నూతన పింఛన్లను వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలో నూతనంగా 488 మందికి పింఛన్లు వచ్చాయన్నారు. ఎంపీడీఓ ఆర్.వి రమణమూర్తి, ఈఓపీఆర్డీ ప్రభాకర్, ఎంఈఓ త్రినాథరావు, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, పార్టీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, పచ్చిగుళ్ల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అరసవల్లి: ఆమదాలవలస ప్రధాన రహదారి విస్తరణ పనుల కారణంగా రాగోలు పరిసర ప్రాంతాల్లో ఈ నెల మూడో తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఈఈ బయ్యన్నాయుడు శుక్రవారం తెలిపారు. గూడెం, వాకలవలస, రావిపాడు, బావాజీపేట, కొత్తరోడ్డు, అక్కివరం, తోటాడ తదితర గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సాగు హక్కు కల్పించాలని వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: గత కొన్నేళ్లుగా సాగులో ఉన్న భూములకు సంబంధించి నారాయణపురం రైతులకు సాగు పట్టాలు అందజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు అన్నారు. చిలకపాలెం సచివాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్య పరిష్కరించాలన్నారు. సాగు హక్కు కల్పించేవరకు పోరాటం చేస్తామన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఏడురోడ్ల కూడలిలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై నాగిరెడ్డి లక్ష్మణరావు క్యాంపస్ కాప్స్‌లో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు.

అడవులతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: మొక్కలు అధికంగా పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని రెడ్డీస్ ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి షామిక్ త్రెహన్ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ అటవీ పెంపకం- క్షేత్రస్థాయి ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రైతులు వ్యవసాయ భూమిలో సగభాగం మొక్కలు పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చీఫ్ ఆపరేషన్స్ అధికారి ప్రణవ్‌చౌదరి, డిప్యూటీ మేనేజర్ హరిబాబు, ఏరియా మేనేజర్ తవిటినాయుడు, సమన్వయకర్తలు అత్తులూరి లావణ్య, రాజ్‌కుమార్, గ్రామపెద్దలు అత్తులూరి గిరి, రాంబాబు పాల్గొన్నారు.